సాక్షి అనకాపల్లి

ఆదివారం । 6 । అక్టోబర్ । 2024



నాట్య మయూరం 8లో

సంప్రదాయ నృత్యంలో వాహినీప్రియ ప్రతిభ చాటుకుంటోంది. చిన్నవయసులోనే కళాకార్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించింది.



విద్యార్థులకు క్షేత్రస్థాయి శిక్షణ

రెండేళ్ల క్రితం పీఎంశ్రీ పథకానికి ఎంపికైన రోలుగుంట పాఠశాల సాంకేతికంగా ముందంజలో ఉంది. అధికారులు పరిశీలించి సంతృప్తి చెందారు. 8లో



వెంకన్న తిరువీధి సేవ 8లో

ఉపమాక వెంకన్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాజాధిరాజ, హంస వాహనాల్లో తిరువీధి సేవలు ఘనంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

జాతీయస్థాయి యోగా పోటీల్లో మహిళా కానిస్టేబుల్‌కు కాంస్యం



మహిళా కానిస్టేబుల్ ఎం.నిర్మలను అభినందిస్తున్న ఎస్పీ దీపిక

తుమ్మపాల: ఇటీవల ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాయ్‌లో జరిగిన ఆలిండియా పోలీస్ యోగా చాంపియన్‌షిప్ 2024–25 పోటీల్లో 2014 బ్యాచ్ మహిళా కానిస్టేబుల్ ముడిల నిర్మల కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా శనివారం ఎస్పీ కార్యాలయంలో ఆమెను ఎస్పీ దీపిక సత్కరించారు. ఇదే స్ఫూర్తిని భవిష్యత్తులో కూడా కొనసాగించి, మరిన్ని జాతీయ స్థాయి పతకాలు సాధించాలని ఎస్పీ ఆకాంక్షించారు. రాష్ట్ర పోలీసు శాఖ తరఫున వివిధ జిల్లాల నుంచి 23మంది పోలీసు సిబ్బంది, అధికారులు ఈ పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. జాతీయ స్థాయిలో పతకం సాధించిన నిర్మలను పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది అభినందించారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఆమె ప్రస్తుతం అచ్యుతాపురం స్టేషన్‌లో పనిచేస్తున్నారు.

నేషనల్ బాక్సింగ్ పోటీలకు మౌనిక



నర్సీపట్నం: బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఈ నెల 6 నుంచి 13వ తేదీ వరకు హర్యానాలో నిర్వహిస్తున్న నేషనల్ యూత్ బాక్సింగ్ పోటీల్లో నర్సీపట్నానికి చెందిన బొంతు మౌనిక పాల్గొంటోంది. నేషనల్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో మౌనిక 80 కేజీల విభాగంలో పాల్గొంటుందని కోచ్ అబ్బు తెలిపారు. ఈ పోటీల్లో ఏదయినా మెడల్ సాధిస్తే ఇండియన్ క్యాంపునకు అర్హత సాధించి, ఇంటర్నేషనల్ లెవెల్‌కు అవకాశం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.

2,618 టన్నుల బియ్యం పట్టివేత

బుచ్చెయ్యపేట : మండలంలోని సీతయ్యపేటలో అక్రమంగా నిల్వ ఉంచిన 2,618 టన్నుల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. స్థానికుల సమాచారం మేరకు శనివారం విజిలెన్స్ సీఐ తిరుపతిరావు,ఎస్‌ఐ రవి,సీఎస్‌డీటీ ఈశ్వరరావు, కానిస్టేబుల్ అప్పారావు సీతయ్యపేటలో బియ్యం గొడౌన్‌లపై దాడులు చేశారు. గ్రామానికి చెందిన రేషన్ డీలర్ యలమర్తి సతీష్‌కు చెందిన గొడౌన్‌లో 2,018 కిలోలు,ఉడత సత్తిబాబు ఇంట్లో 600 కిలోల బియాన్ని పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని రావికమతంలోని గొడౌన్లకు తరలించి, ఇద్దరిపై 6ఎ కేసు నమోదు చేసినట్టు సీఎస్‌డీటీ తెలిపారు. గతంలో కూడా సీతయ్యపేట రేషన్ డీలర్ అక్రమంగా నిల్వ చేసిన బియ్యాన్ని అధికారులు పట్టుకుని, 6ఎ కేసు నమోదు చేశారు.

మహా నేత ‘వరం’.. అన్నదాతల్లో ఆనందం

దార్శనికులు ముందు చూపుతో భవిష్యత్తును వీక్షిస్తారు.. అందుకు మంచి మనసు కూడా తోడైతే తరతరాలకు మేలు జరుగుతుంది. మళ్లీ మళ్లీ అలాంటి మహానుభావులను తలచుకునేలా చేస్తుంది. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి కృషి వల్ల బీడు భూముల్లో అన్నదాతలు నాలుగు తిండి గింజలు పండించే పరిస్థితి ఏర్పడింది. పోలవరం కాలువ పుణ్యమా అని మెట్ట భూముల్లో ఈ ఖరీఫ్ సీజన్‌లో కూడా వరి నాట్లు ముమ్మరంగా పూర్తయ్యాయి. ఖరీఫ్‌లోనే కాకుండా రబీలో కూడా పోలవరం కాలువకు అటు ఇటు ఉన్న భూముల్లో వరితోపాటు అపరాలు, కూరగాయలు, ఉద్యానవన పంటలు పండిస్తూ రైతులు ఆనందంతో జీవిస్తున్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో కూడా ఈ పోలవరం కాలువ ఆయకట్టు తమను ఆదుకుంటోందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- పోలవరం కాలువలో పుష్కలంగా చేరిన నీరు
- ఈసారి కూడా మెరక భూముల్లో ముమ్మరంగా వరి సాగు



నిర్మాణంలో ఉన్న కాలువలో పుష్కలంగా చేరిన వర్షం నీరు



కాలువకు ఇరువైపులా రైతులు సాగు చేస్తున్న వరి పంట

నక్కపల్లి: వైఎస్సార్ అడుగుజాడ ఎంత బలమైనదో చెప్పడానికి ఇదే మంచి ఉదాహరణ. ఆయన చేసిన మేలు రైతులను ఇప్పటికీ ఆదుకుంటోంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో కూడా ఆయన హయాంలో తవ్విన పోలవరం కాలువ మెట్ట భూముల్లో బంగారం పండించింది. మహానేత 2003లో పాదయాత్ర చేపట్టినప్పుడు ఈ ప్రాంతంలో పోలవరం కాలువ నిర్మాణ ఆవశ్యకతను గుర్తించారు. 2004లో అధికారంలోకి వచ్చిన తర్వాత రాజీవ్ పల్లెబాట కార్యక్రమంలో ఈ ప్రాంత పర్యటనకు వచ్చినప్పుడు త్వరలోనే ప్రాజెక్టు నిర్మాణ పనులు, కాలువ తవ్వకాలు ప్రారంభిస్తామని వైఎస్ హామీ ఇచ్చారు. ఆయన చెప్పినట్టుగానే 2006లో పాయకరావుపేట నుంచి తాళ్లపాలెం వరకు 5, 6, 7 ప్యాకేజీ కింద ఎడమ కాలువ నిర్మాణ పనులు శరవేగంగా ప్రారంభమయ్యాయి. ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యం జరుగుతున్నప్పటికీ కాలువ తవ్వకాలు చేపట్టడం వల్ల కాలువల్లో పుష్కలంగా నీరు చేరింది. ఒకప్పుడు అపరాల పంటకే పరిమితమైన భూముల్లో పదేళ్ల నుంచి రైతులు వరి కూడా సాగు చేస్తున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో కూడా వరినాట్లు పూర్తయ్యాయి. వరి పొలాలు ఏపుగా పెరుగుతున్నాయంటూ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పోలవరం కాలువలో చేరిన నీరు ఖరీఫ్ సీజన్‌కు పూర్తిగా సరిపోతోంది. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, యలమంచిలి మండలాల్లో పోలవరం కాలువకు ఇరువైపులా సుమారు 10 వేల ఎకరాలు మెట్ట భూములు ఉన్నాయి. వీటిలో సుమారు 3 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తుంటారు.

వర్షాలు కురవక పోయినా ధోకా లేదు

ఎప్పటి మాదిరిగా ఈ ఏడాది కూడా పోలవరం కాలువలో చేరిన నీటిని ఇంజిన్ల సహాయంతో మెట్ట భూములకు ఉపయోగించి వరి సాగు చేశారు. అరటి, అపరాలు, కూరగాయల పంటలకు సైతం ఇదే నీటిని వినియోగిస్తున్నామని రైతులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. వర్షాలు పడకపోయినా ఖరీఫ్‌లో కాలువకు ఇరువైపులా సాగు చేసిన భూములకు నీటికి ధోకా ఉండదని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

కాలువ పనులు 60 శాతం పూర్తయ్యాయి. దిగువ ప్రాంతాలకు కూడా స్లూయిజ్‌లు ఏర్పాటు చేసి నీటి మార్గాలను ఏర్పాటు చేస్తే పల్లం భూములకు కూడా పోలవరం కాలువ అందుబాటులోకి వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లు, పెదదొడ్డిగల్లు, సీతంపాలెం, గుల్లిపాడు, దోసలపాడు, జగన్నాథపురం, రమణయ్యపేట, ముకుందరాజుపేట, బోదిగల్లం రామకృష్ణాపురం, ఎస్.రాయవరం మండలం చెల్లాపురం, రామయ్యపట్నం, కొత్తూరు తదితర గ్రామాలను ఆనుకుని ఉన్న పోలవరం కాలువలో చేరిన నీటిని ఇంజిన్ల సహాయంతో తోడుకుని వరి నాట్లు పూర్తి చేశారు. నెలరోజుల క్రితమే ఇక్కడ నాట్లు పూర్తయ్యాయి. రైతులు ఎరువులు, పురుగుల మందులు పిచికారీ చేస్తున్నారు. రెండో విడత నీటిని కూడా ఉపయోగించుకునేందుకు సిద్ధమవుతున్నారు.

ఏనాడో అందిన వరం



మహానేత వైఎస్ పుణ్యమా అని పోలవరం కాలువలో చేరిన నీటిని ఉపయోగించి మెట్ట భూముల్లో వరి, కూరగాయలు, అపరాలు సాగు చేస్తున్నాం. ఇంజిన్ల సాయంతో నీటిని తోడి పంటలకు ఉపయోగిస్తున్నాం. సుమారు పదేళ్ల నుంచి కాలువకు ఎగువ దిగువ ప్రాంతాల్లో భూములు కలిగిన రైతులంతా కాలువలో చేరిన నీటిని ఉపయోగించుకుని సాగు చేసుకునే పరిస్థితి నెలకొంది. ప్రాజెక్టు పనులు పూర్తికాకపోయినా కాలువ నిర్మాణం ద్వారా అందుబాటులోకి వచ్చిన నీటిని ఉపయోగించుకుని అన్నదాతలు తిండి గింజలు పండించే అవకాశం ఏర్పడింది.

– గొర్ల గోవిందు, రైతు, సీతంపాలెం

‘ఏదయా మీదయా మామీద లేదు’



జంపపాలెంలో దసరా పాటలు పాడుతూ తిరుగుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

- జంపపాలెంలో సంప్రదాయబద్ధంగా విజయదశమి వేడుకలు
- ఇంటింటికీ దసరా బాణాలతో పాటలు పాడుతూ తిరిగిన ఉపాధ్యాయులు, విద్యార్థులు

యలమంచిలి రూరల్: చిన్నతనంలో ధనుస్సులు పట్టుకొని వీధుల్లో తిరగడం... పెద్దలు ఆశీర్వదించి నగదుగానో... మరో రూపంలోనో కానుకలు అందించడం...నిన్నటి తరానికి ఓ తీపి గుర్తు. కార్పొరేటు సంస్కృతి, సెల్‌ఫోన్ల ప్రభావం పెరగడంతో మన సంస్కృతి మూలకు చేరిపోయింది. అయితే ఇప్పుడు అక్కడక్కడా మళ్లీ ఈ సరదాలు కనిపిస్తున్నాయి. సంప్రదాయాలు క్రమేణా కనుమరుగవుతున్న సందర్భంలో పల్లెసీమల్లో ఇంకా కొందరు ఉపాధ్యాయులు దసరా సంప్రదాయాన్ని కొనసాగేలా కృషి చేస్తున్నారు. మండలంలోని జంపపాలెంలో జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు శాస్త్రి, కొందరు ఉపాధ్యాయులు ప్రభుత్వం ప్రకటించిన దసరా సెలవుల్లో ఇళ్లకే పరిమితం కాకుండా విద్యార్థులకు అలనాటి సంస్కృతీ సంప్రదాయాలపై అవగాహన కల్పిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఈ క్రమంలో శనివారం విద్యార్థులకు దసరా వైభవం, చరిత్ర గురించి వివరించారు. విద్యార్థులతో దసరా బాణాలు తయారుచేయించారు. వారంతా గ్రామంలో తిరుగుతూ విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ఏదయా.. మీదయా.. మామీద లేదు అంటూ పాటలు, పద్యాలు పాడుతూ పూలను వెదజల్లేలా బాణాలను సంధించారు. చివరలో జయీభవ.. విజయీభవ పాటతో ముగించారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా గొంతు కలపడంతో ఈ కార్యక్రమంలో గ్రామస్థులు కూడా ఉత్సాహంగా భాగస్వాములయ్యారు. విద్యార్థుల ఇళ్లకు వెళ్లినపుడు తల్లిదండ్రులు పప్పు బెల్లం, స్వీట్లు పంచిపెట్టారు. దీంతో వారం రోజుల ముందుగానే జంపపాలెంలో దసరా సందడి నెలకొంది. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ కనకారావు, సభ్యులు పాల్గొన్నారు.

ఇసుక కోసం ప్రజా ఉద్యమం

- మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్
- ఉచితంగా ఇసుక అందించాలంటూ ఆర్డీవోకు వినతి
- స్పందించకుంటే ఈ నెల 21న శాంతియుత నిరసన ర్యాలీ



ఆర్డీవో వి.వి.రమణకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్, పార్టీ నాయకులు

నర్సీపట్నం: ఇసుక కోసం ప్రజల తరఫున పోరాడతామని, గబ్బాడ స్టాక్ పాయింట్‌లోని ఇసుకను ఉచితంగా పంపిణీ చేయకుంటే ఈ నెల 21న శాంతియుతంగా నిరసన ర్యాలీ నిర్వహిస్తామని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. స్టాక్ పాయింట్‌లో ఇసుకను ప్రజలకు ఉచితంగా అందించాలని కోరుతూ పార్టీ నాయకులతో కలిసి శనివారం ఆయన ఆర్డీవో వి.వి.రమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గబ్బాడ స్టాక్ పాయింట్‌లో వేల టన్నుల ఇసుక నిల్వలు ఉన్నప్పటికీ పంపిణీ చేయకుండా భవననిర్మాణదారులు, భవన నిర్మాణ కార్మికులను ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. ఇసుక సమస్యను ఇది వరకే కలెక్టర్‌కు దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. నర్సీపట్నం పరిసర ప్రాంతాల్లో ఐదు వేల మంది కార్మికులు భవన నిర్మాణ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ఉచితంగా ఇసుక అందిస్తామంటూ ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఊదరగొట్టారని, తీరా అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీని అటకెక్కించారన్నారు. ఉచితంగా ఇసుకను సరఫరా చేయనందున కార్మికులు సైతం రోడ్డు ఎక్కవలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇసుక కొరత వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులు దృష్ట్యా మరో మారు ఆర్డీవోను కలిసి వినతి పత్రం అందజేశామని, అధికారులు స్పందించి 15 రోజుల్లో స్టాక్ పాయింట్‌లోని ఇసుకను ఉచితంగా అందించాలని, లేకపోతే ఈ నెల 21 శాంతియుత నిరసన ర్యాలీ చేపడతామని హెచ్చరించారు. క్యాంపు కార్యాలయంలో నిరసన ర్యాలీ పోస్టర్లను ఆవిష్కరించారు. పార్టీ సీనియర్ నాయకుడు రుత్తల యర్రాపాత్రుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, వైఎస్సార్‌సీపీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, పార్టీ నాయకులు చింతకాయల వరుణ్, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, పార్టీ మండల అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, రుత్తల శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, ఎస్సీసెల్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వెలుగు వీవోఏల డిమాండ్



కలెక్టరేట్ వద్ద వీవోఏల నిరసన ప్రదర్శన

తుమ్మపాల: రాజకీయ వేధింపులు ఆపాలని, ఐదు నెలల బకాయి జీతాలు వెంటనే విడుదల చేయాలని, మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద శనివారం వెలుగు వీవోఏలు నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ, వీవోఏల సంఘం ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వీవోఏల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వి.వి. శ్రీనివాసరావు, అధ్యక్షుడు కె.సూరిబాబు మాట్లాడుతూ వీవోఏలకు ఐదు నెలల నుంచి జీతాలు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గత మూడు నెలల్లో వందలాది మందిని తొలగించారని, వారందరినీ వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, మూడు సంవత్సరాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, యూనిఫామ్, ఐడెంటిటీ కార్డులు, గ్రూప్ ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ‘లడ్డూ’ రాజకీయాలను పక్కనపెట్టి చిరు ఉద్యోగుల జీతాలు వెంటనే విడుదల చేయాలన్నారు. అనంతరం డీఆర్వో బి.దయానిధి, డీఆర్‌డీఏ అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి డైజీలకు వినతిపత్రం అందించారు.ఈ కార్యక్రమంలో వీవోఏ యూనియన్ నాయకులు రాము, మాణిక్యం, పుష్ప, క్రాంతి, త్రినాథ్, సత్యం, రమణ, లావణ్య పాల్గొన్నారు.

ఓటరు జాబితాల తనిఖీ 99.89 శాతం పూర్తి

- మొత్తం 1,28,801 ఓటర్ల ధ్రువీకరణ పూర్తి
- ఈనెల 29 నుంచి నవంబర్ 28 వరకు ఓటర్ నమోదు, అభ్యంతరాల స్వీకరణ
- డీఆర్వో దయానిధి



డీఆర్వో దయానిధి

తుమ్మపాల: స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీల సహకారం ఎంతో అవసరమని జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి అన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణకు సంబంధించి ఇంటింట ఓటరు జాబితాల తనిఖీ 99.89 శాతం పూర్తిచేసినట్టు చెప్పారు. జిల్లాలో 1,29,276 ఓటర్లు ఉన్నారని, వారిలో 1,28,801 ఓటర్లను ధ్రువీకరించినట్టు తెలిపారు. అక్టోబరు 29న డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రకటిస్తారని, ఓటరు జాబితాకు సంబంధించిన అభ్యంతరాలుంటే తెలియజేయాలన్నారు.

- జిల్లాలో 1,529 పోలింగు కేంద్రాలు ఉన్నాయని, మాడుగుల నియోజకవర్గం నుంచి నాలుగు, నర్సీపట్నం నియోజకవర్గం నుంచి ఏడు పోలింగు కేంద్రాల లొకేషను మార్పునకు ప్రతిపాదనలు వచ్చాయని, 11 పోలింగ్ స్టేషన్ల లొకేషన్ల మార్పు కోసం ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు పంపిస్తామని డీఆర్వో దయానిధి చెప్పారు.
- 2025 సంవత్సరం జనవరి 1వ తేదీన నాటికి 18 ఏళ్లు నిండిన వారు / అర్హత కలిగిన పౌరులు అక్టోబర్ 29 నుంచి నవంబర్ 28 వరకు ఓటరు నమోదుకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఓటరు నమోదుతో పాటు అభ్యంతరాలు, దిద్దుబాట్ల కోసం కూడా దాఖలు చేసుకోవచ్చని తెలిపారు. పోలింగ్ స్టేషన్లలో నవంబరు 9, 10, 23, 24 తేదీల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ రోజుల్లో ముసాయిదా ఓటర్ల జాబితాతో పాటు సంబంధిత పోలింగ్ స్టేషన్ల ఓటరు జాబితాలను పరిశీలించి, సవరణలు గుర్తించి, దరఖాస్తులను స్వీకరించనున్నట్టు తెలిపారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేయడానికి బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉంటారన్నారు.

రాజకీయ పార్టీల ఏజెంట్లు ప్రత్యేక ప్రచార కార్యక్రమం సమయంలో ప్రజలకు అవగాహన కల్పించి, ఓటరు జాబితా పరిశీలించుకునే విధంగా ప్రోత్సహించాలని కోరారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో ఒక కుటుంబ సభ్యుల ఓట్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఉంటున్నాయని, దాని వల్ల ఓటింగు సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఒక డోరు నంబర్‌లో గల ఓట్లు ఒకే పోలింగు కేంద్రంలో వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం 1500 ఓటర్లకు ఒక పోలింగు కేంద్రం ఏర్పాటు చేస్తున్నారని, దానివల్ల ఓటింగ్‌కు చాలా సమయం పడుతోందని, కొన్ని చోట్ల రాత్రి 12 గంటల తరువాత కూడా ఓటింగు జరుగుతోందని చెప్పారు.

అందువల్ల పోలింగ్ కేంద్రానికి వెయ్యి నుంచి 1200 మంది ఓటర్లు ఉండే విధంగా మార్పులకు ప్రతిపాదనలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంటు ఎస్.ఎస్.వి.నాయుడు, రాజకీయ పార్టీల ప్రతినిధులు మళ్ల గణేష్, పి.నాగేశ్వరరావు, మీసాల సుబ్బన్న, ఎం.జానకీరామరాజు, గంటా శ్రీరాం పాల్గొన్నారు.

క్లుప్తంగా

కత్తితో బెదిరించి.. రూ.2 లక్షలు దోచుకొని..

- మహిళను ఆటో నుంచి తోసేసిన సహ ప్రయాణికులు
- ఆటో డ్రైవర్‌తో కలిసి ఇద్దరు మహిళల ఆగడం

తుమ్మపాల: ఆటోలో ప్రయణిస్తున్న మహిళను మరో ఇద్దరు మహిళలు కత్తితో బెదిరించి రూ.2 లక్షలు దోచుకున్నారు. పట్టణ ఎస్సై అల్లు వెంకటేశ్వరరావు అందించిన వివరాల ప్రకారం.. సీలేరు ఏపీ జెన్‌కోలో ఉద్యోగం చేస్తున్న చెక్కల సుధ అనే మహిళ శుక్రవారం మధ్యాహ్నం పట్టణానికి చేరుకుని స్వస్థలం గాజువాక వెళ్లేందుకు నాలుగు రోడ్ల కూడలి వద్ద ఆటో ఎక్కింది. దారిలో జలగల మదుం వద్ద ఆటోలో ఉన్న మరో ఇద్దరు మహిళలు కత్తితో ఆమెను బెదిరించి, ఆమె వద్ద ఉన్న రూ.2 లక్షల నగదును దోచుకుని ఆమెను ఆటో నుంచి బయటకు తోసేశారు. ఆమె తన భర్తకు ఫోన్ చేసి విషయం తెలపడంతో భర్త ఘటన స్థలానికి వచ్చి స్వల్ప గాయాలతో ఉన్న ఆమెను గాజువాక తీసుకువెళ్లారు. ఈ ఘటనపై శనివారం వచ్చి ఫిర్యాదు ఇచ్చారని ఎస్సై తెలిపారు. ఆటో డ్రైవర్, ఇద్దరు మహిళలు ఒక ముఠాగా ఏర్పడి ఈ ఘటనకు పాల్పడినట్టు అనుమానిస్తున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏలేరు కాలువలో యువకుడు గల్లంతు

కోటవురట్ల: తీడ వద్ద ఏలేరు కాలువలో శనివారం యువకుడు గల్లంతైనట్లు తెలిసింది. అతడిని కన్నూరుపాలెం చెందిన లోవ(35)గా స్థానికులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియరాలేదు. ఆర్థిక సమస్యలు కావచ్చునని భావిస్తున్నారు. పోలీసులను సంప్రదించగా తమ దృష్టికి రాలేదన్నారు.

నాట్య మయూరం..

అరచేతిలో ఇమిడిన సాంకేతిక విప్లవం మోజులో పడిపోయిన నేటి యువతరానికి ఆదర్శంగా నిలుస్తోంది నృత్యకారిణి వాహినీ ప్రియ. ఆమెకు తల్లిదండ్రులు ప్రోత్సాహం తోడవడంతో విద్యతో పాటు శాస్త్రీయ నృత్యం వైపు అడుగులేస్తూ.. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటుతోంది. బాల్య దశలోనే యలమంచిలి నాట్య మయూరిగా ప్రశంసలు అందుకుంటోంది.

- సంప్రదాయ నృత్యంలో రాణిస్తున్న యలమంచిలి నృత్యకారిణి
- రాష్ట్ర, దేశ వ్యాప్తంగా ప్రదర్శనలు
- కళాకార్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో విద్యార్థిని వాహినీ ప్రియకు చోటు

యలమంచిలి రూరల్: పట్టణంలోని కొత్తపేటకు చెందిన దాసరి వాహినీ ప్రియ తన 9వ ఏట నుంచే కూచిపూడి, భరతనాట్యంపై ఆసక్తి పెంచుకుంది. తల్లిదండ్రులు దాసరి సతీష్, శ్రీదేవి సైతం తమ కుమార్తె ఇష్టాన్ని కాదనకుండా సంప్రదాయ కళల్లో ప్రోత్సహిస్తున్నారు. ఓ ప్రైవేటు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న వాహినీ ప్రియ ఆరేళ్లుగా శిక్షకుల వద్ద తర్ఫీదు పొందుతోంది. సహజ నైపుణ్యంతో తనదైన శైలిలో రాణిస్తూ నృత్యంలో ఆకట్టుకుంటోంది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక పతకాలు, బహుమతులు పొందింది.

60కుపైగా ప్రదర్శనలు.. పలు పురస్కారాలు...

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రముఖ పుణ్యక్షేత్రాలు, ప్రభుత్వ కార్యక్రమాలు, విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, హైదరాబాద్ నగరాల్లో ఇప్పటివరకు వివిధ వేదికలపై 60కి పైగా నృత్య ప్రదర్శనలిచ్చింది. నాట్య హంస, నాట్య కళామంజరి, నాట్య చూడామణి, నర్తన కృష్ణ, సంక్రాంతి నంది వంటి అవార్డులు పొందింది. కూచిపూడిలో ప్రతిభ ఆధారంగా భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్



వాహినీ ప్రియకు దక్కిన కళాకార్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ పురస్కారం

గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో ప్రముఖ కళాకార్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో పేరు లిఖించుకుంది. కార్యక్రమంలో భాగంగా ఆమెకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పురస్కారం అందించారు. జాతీయ స్థాయి త్రినేత్ర నృత్య నీరాజనం పోటీల్లో బహుమతి గెలుచుకుంది. 2023 జనవరిలో రాజమహేంద్రవరం ఆనం కళాక్షేత్రంలో జరిగిన నృత్య పోటీల్లో సంక్రాంతి నంది పురస్కారాన్ని అప్పటి ఎంపీ మార్గాని భరత్ నుంచి స్వీకరించింది. 2022లో తిరుమలలో జరిగిన



సంప్రదాయ నృత్య ప్రదర్శన ఇస్తున్న వాహినీప్రియ

బ్రహ్మోత్సవాలు, వారణాశి కాశీ విశ్వనాథ దేవాలయం, తమిళనాడు అరుణాచలం గిరి ప్రదక్షిణ సమయంలో, సింహాచలం, శ్రీకాళహస్తి, వాడపల్లి వేంకటేశ్వరస్వామి, విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంతో పాటు పలు నగరాల్లో వాహినీ ప్రియ నృత్య ప్రదర్శనలిచ్చింది. ఈ ఏడాది ఫిబ్రవరి 26న అమృత్



వాడపల్లిలో వాహినీ ప్రియకు అవార్డు అందజేస్తున్న దేవదాయ శాఖ అధికారులు

భారత్ స్టేషన్ స్కీమ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో యలమంచిలి రైల్వే స్టేషన్‌లో వేదికపై తనదైన నృత్యంతో ఆకట్టుకుంది. ప్రదర్శనను తిలకించిన అప్పటి ఎమ్మెల్యే కన్నబాబురాజు, రైల్వే అధికారులు, పట్టణ ప్రముఖులు ప్రశంసించారు. యలమంచిలి నాట్య మయూరి అంటూ అభినందించారు.



అమ్మానాన్నల ప్రోత్సాహం

అమ్మ శ్రీదేవి, నాన్న సతీష్ నా ఆసక్తిని గమనించి ప్రోత్సహిస్తున్నారు. కూచిపూడిలో ప్రావీణ్యం రావడంతో చాలా పోటీల్లో పాల్గొన్నాను. తిరుమల తిరుపతి బ్రహ్మోత్సవాల సమయంలో ఇచ్చిన ప్రదర్శన నాకు సంతృప్తినిచ్చింది. నా గురువులు శ్రీవల్లి, శోభ భవానీ కూనపల్లి మంచి శిక్షణ ఇస్తున్నారు. మరిన్ని మెలకువలు నేర్చుకుని సంప్రదాయ నృత్యానికి ఖ్యాతి తేవడానికి కృషి చేస్తాను.

– దాసరి వాహినీ ప్రియ, యలమంచిలి

రాజాధిరాజ వాహనంపై వెంకన్న తిరువీధి సేవ



రాజాధిరాజ వాహనంలో స్వామివారికి తిరువీధి సేవ నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాకలో గరుడాద్రి పర్వతంపై కల్కి అవతారంలో స్వయం వ్యక్తమై వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉభయ దేవేరులతో కూడిన స్వామివారిని రాజాధిరాజ వాహనంపై తిరువీధి సేవలు నిర్వహించారు. నవాహ్నిక దీక్షతో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు నిత్యాభిషేకం, అర్చనలు నిత్యహోమం నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను రాజాధిరాజ వాహనంలో సుదర్శన పెరుమాళ్లను పల్లకిలో వేంచేయింపు చేసి మాఢవీధుల్లో తిరువీధి సేవలు నిర్వహించారు. అనంతరం గ్రామ బలిహరణలు పూర్తి చేశారు. సాయంత్రం స్వామివారికి హంస వాహనంలో తిరువీధి సేవ నిర్వహించారు. కార్యక్రమాల్లో ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, అర్చక స్వాములు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, గోపాలాచార్యులు, సాయి ఆచార్యులు, రాజగోపాలాచార్యులు దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు. శరన్నవరాత్రులు, దసరా సెలవులు కలిసి రావడంతో ఉపమాక వెంకన్న ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. క్యూలైన్లో స్వామివారిని దర్శించుకుంటున్నారు. గోదాదేవి సన్నిధిలో రోజూ సాయంత్రం లక్ష్మీ సహస్ర కుంకుమార్చన నిర్వహిస్తున్నారు. అమ్మవారిని సాయంత్రం పల్లకిలో ఊరేగిస్తున్నారు.

ఖాళీగా ఉన్న ఇంటికి రూ.4 వేలకు పైగా కరెంటు బిల్లు

కోటవురట్ల: స్థానిక గవరపేట కనకమహాలక్ష్మి వీధిలో విద్యుత్ వినియోగించని ఇంటికి ఈ నెల ఏకంగా రూ.4 వేలు పైబడి బిల్లు రావడంతో ఇంటి యజమాని లబోదిబోమంటున్నాడు. బాధితుడు వేగి పరిశినాయుడు అందించిన వివరాల ప్రకారం.. కనకమహాలక్ష్మి వీధిలో ఉన్న తన ఇంటికి 3208 సర్వీసు నెంబర్‌తో విద్యుత్ కనెక్షన్ ఉంది. ఆ ఇల్లు పాడుబడి నివాసయోగ్యంగా లేకపోవడంతో ఖాళీ చేసి దాదాపు రెండేళ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఆ ఇంటికి ప్రతి నెల వస్తున్న కనీస చార్జి రూ.40 ఇప్పటికీ బకాయి లేకుండా చెల్లిస్తూనే ఉన్నాడు. అయినప్పటికీ వినియోగంలో లేని ఇంటి సర్వీసుకు ఈ నెల విద్యుత్ బిల్లు రూ.4,069.45 రావడంతో అవాక్కయ్యాడు. ఈ విషయాన్ని విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు బాధితుడు పరిశినాయుడు తెలిపారు.



ఉత్తమ అవార్డుకు ఐదు పంచాయతీల పరిశీలన

తుమ్మపాల: జాతీయస్థాయి గ్రామ పంచాయతీ గుర్తింపు అవార్డు 2024–25కు జిల్లాలో ఐదు గ్రామ పంచాయతీలను పరిశీలిస్తున్నారు. తొమ్మిది విభాగాలలో అవార్డులకు ఎంపిక చేసేందుకు ఈ పంచాయతీల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ప్రత్యేక బృందాలు ఆది, సోమవారాల్లో పర్యటించనున్నాయి. జిల్లాలో ఐదు విభాగాలకు సంబంధించి అనకాపల్లి, నక్కపల్లి మండలాల్లో ఐదు పంచాయతీలను ఎంపిక చేసేందుకు గల అర్హతలు, రికార్డులను పరిశీలించనున్నారు.

పరిశీలనకు ఎంపికైన గ్రామ పంచాయతీలు

మండలం	గ్రామం	విభాగం
అనకాపల్లి	తుమ్మపాల	పంచాయతీ గుడ్ గవర్నెన్స్
అనకాపల్లి	తగరంపూడి	క్లీన్ అండ్ గ్రీన్ పంచాయతీ
నక్కపల్లి	ఉద్దండపురం	సోషల్ జస్టిస్, సోషియల్లీ సెక్యూర్డ్ పంచాయతీ
నక్కపల్లి	ఉపమాక	సెల్ఫ్ సఫిషియంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పంచాయతీ
నక్కపల్లి	డీఎల్ పురం	చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీ

రోలుగుంట హైస్కూలు విద్యార్థులకు క్షేత్రస్థాయి శిక్షణ



స్థానిక కోడుగుడ్ల పరిశ్రమలో అట్టల తయారీలో పాల్గొన్న విద్యార్థులు



వ్యవసాయ కార్యాలయంలో ఎరువుల గురించి తెలుసుకుంటున్న విద్యార్థులు

- 2022లో పీఎంశ్రీ పథకం కింద ఎంపిక
- అందుబాటులో హెల్త్, అగ్రికల్చర్ ట్రేడ్లు
- పూర్తి స్థాయిలో ల్యాబ్ ఎక్విప్‌మెంటు
- పరిశీలించి సంతృప్తి చెందిన అధికారులు

రోలుగుంట : రోలుగుంట పాఠశాల పీఎంశ్రీ పథకానికి 2022లో ఎంపికైందని వృత్తి విద్యాకోర్సులు కూడా ప్రారంభమయ్యాయని హెచ్ఎం డి.ఎస్.ఎస్.వి. ప్రసాద్ తెలిపారు. అందుబాటులో అగ్రికల్చర్, హెల్త్‌కోర్సులు, అందుకు తగ్గట్టుగా లాబ్ ఎక్విప్‌మెంటు కూడా ఉందన్నారు. హెల్త్ , అగ్రికల్చర్ ట్రేడ్లు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థుల ఆసక్తి మేరకు 9,10 తరగతి విద్యార్థులను ఎన్‌రోల్ చేసినట్టు హెచ్ఎం తెలిపారు. ఈ కోర్సుల్లో ప్రాక్టికల్ అనుభవం కోసం విద్యార్థులకు ఇండస్ట్రియల్ విజిట్, ట్రయినింగు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నారు. రోలుగుంట సమీపంలో గల కోడిగుడ్డు అట్ల తయారీ పరిశ్రమలో అట్టల తయారీ గురించి విద్యార్థులు తెలుసుకున్నారు. అలాగే స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఎరువుల గోదాంను సందర్శించి ఎరువుల గురించి తెలుసుకున్నారు. వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. అదేవిధంగా ఆరోగ్యకేంద్రానికి విద్యార్థులను తీసుకెళ్లి అక్కడ చికిత్సల గురించి అవగాహన కల్పించారు. కాగా వృత్తి విద్య ఇన్‌స్పెక్టర్లు శ్యామల, నాగమణి శుక్రవారం ఈ శిక్షణ కార్యక్రమాన్ని పర్యవేక్షించి పలు సూచనలు అందజేశారు. కార్యక్రమం నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంలో దసరా సెలవుల్లో కూడా శిక్షణ పొందుతున్నారని హెచ్ఎం వివరించారు. ఈ కోర్సుల్లో విద్యార్థుల నైపుణ్యాలు మెరుగ్గా ఉండడంతో పాటు, ప్రాక్టికల్ నాలెడ్జ్ పెరిగి లైఫ్ స్కిల్స్ పెంచుకోవడానికి దోహదపడతాయని హెచ్ఎం తెలియజేశారు. విద్యార్థులు కూడా ఈ కార్యక్రమాల పట్ల ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారని తెలిపారు.

ప్రేరణ ఉత్సవ్‌కు జిల్లా విద్యార్థులు

- గుజరాత్‌లో నేటి నుంచి కార్యక్రమం

యలమంచిలి రూరల్: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసి వారిలో ప్రేరణ నింపడమే లక్ష్యంగా కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న ప్రేరణ ఉత్సవ్- 2024కు జిల్లా నుంచి ఎంపికైన ఇద్దరు విద్యార్థులు శనివారం గుజరాత్ చేరుకున్నారు. దేశంలో ఒక్కో జిల్లా నుంచి ఇద్దరు చొప్పున విద్యార్థులను గతంలో ఎంపిక చేశారు. యలమంచిలి జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 12వ తరగతి చదువుతున్న దిగుమర్తి వైష్ణవి, నర్సీపట్నం జెడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థి పి. హర్షవర్ధన్ ఎస్కార్ట్ టీచర్ ఏ సునీతతో కలిసి గుజరాత్‌లో వాడ్నాగర్ ప్రేరణ స్కూల్‌కు చేరుకున్నారు. ఇక్కడ ఈ నెల 6 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న వివిధ కార్యక్రమాల్లో వీరంతా భాగస్వాములు కానున్నారు. రోజూ ఉదయం యోగా, మెడిటేషన్ సెషన్, అభ్యసన కార్యక్రమాలు, సాయంత్రం పురాతన వారసత్వ ప్రదేశాల సందర్శనలు, స్ఫూర్తిదాయకమైన చలనచిత్ర ప్రదర్శనలు ఉంటాయి. భారతీయ వారసత్వం గొప్పతనం, రాష్ట్రాల వారీగా విద్యార్థుల స్థానిక జిల్లా, గ్రామాల సంస్కృతీ సంప్రదాయాలను కార్యక్రమంలో ఒక వారంలో పాల్గొంటున్న పది జిల్లాల విద్యార్థులతో చెప్పిస్తారు. రాత్రి సమయాల్లో టాలెంట్ షోలు, జాతీయ, అంతర్జాతీయంగా అత్యాధునిక సాంకేతిక వ్యవస్థలు, పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తారు. మొత్తంగా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించి వారిలో ప్రేరణ వచ్చేలా చేస్తారని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎం.ఎం. పట్నాయక్ తెలిపారు. జాతీయ విద్యా విధానం -2020లో భాగంగా దేశంలోని యువతలో సృజనాత్మకత, విలువలతో కూడిన విద్య అలవర్చడం, దేశ సంస్కృతీ సంప్రదాయాలను గౌరవించేలా చేయడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశంగా ఆయన చెప్పారు.



గుజరాత్ రాష్ట్ర విద్య పరిశోధనా సంస్థ కార్యాలయానికి ఎస్కార్ట్ టీచర్‌తో చేరుకున్న జిల్లా విద్యార్థులు

విద్యార్థిని కాటేసిన కరెంటు తీగ

- పొలాల్లో తెగిపడిన వైరు తగిలి మృతి
- పి. భీమవరంలో విషాదం

బుచ్చెయ్యపేట: దసరా సెలవులు కావడంతో పొలం పనులు చేస్తున్న తండ్రికి చేదోడుగా ఉండేందుకు వెళ్తున్న కుమారుడిని కరెంటు తీగ బలి తీసుకుంది. పొలంలో తెగి పడిన విద్యుత్ తీగ తగిలి పదో తరగతి విద్యార్థి వేపాడ భవానీ శంకర్(14) మృతి చెందాడు. ఈ ఘటన బుచ్చెయ్యపేట మండలం పి. భీమవరంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వేపాడ అప్పలనాయుడు, నాగమణిల కుమార్తె హేమలత వడ్డాది కేజీబీవీలో ఇంటర్, కుమారుడు భవానీశంకర్ జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నారు. శనివారం మధ్యాహ్నం పొలం పని చేస్తున్న తండ్రి అప్పలనాయుడు వద్దకు తన మేనత్త కొడుకు జశ్వంత్‌తో కలిసి భవానీశంకర్ వెళ్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. శుక్రవారం వీచిన గాలివానకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ వైరుపై చెట్టుకొమ్మ విరిగిపడింది. దీంతో తీగ తెగి కింద పడింది. దీన్ని గమనించని అతడు షాక్‌కు గురయ్యాడు. వీపునకు తీగ తగిలి వెనుక భాగమంతా కాలిపోయి కుప్పకూలిపోయాడు. నేలపై పడి ప్రాణాలతో కొట్టుమిట్టాడుతుండగా వెనుక వస్తున్న జశ్వంత్ రక్షించడానికి ప్రయత్నించగా, షాక్ తగలి పడిపోవడంతో త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. దగ్గరలో భవానీశంకర్ తండ్రి అప్పలనాయుడు వద్దకు పరుగు తీసి విషయం చెప్పాడు. వెంటనే వచ్చి కరెంట్ వైరుపై పడి ఉన్న తన కుమారుడిని కర్ర సహాయంతో పక్కకు తీశాడు. అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్న కొడుకును చూసి ఆందోళనకు గురయ్యాడు. వెంటనే స్థానికుల సహాయంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. ఈ ఘటనతో గ్రామంలో శోకసంద్రం నెలకొంది.

అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న తమ కుమారుడు మృతితో తల్లిదండ్రులు బోరున విలపించారు. విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యానికి బలైపోయాడని కన్నీంటి పర్యంతమయ్యారు. తండ్రి అప్పలనాయుడు ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.



భవానీశంకర్ మృత దేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్) భవానీ శంకర్(ఫైల్)

క్లుప్తంగా

భవానీభక్తులకు ఆతిథ్యం



కాలి నడకన వెళ్తున్న భవానీభక్తులకు ఆతిథ్యమిచ్చి సాగనంపుతున్న స్థానిక భక్తులు

కశింకోట: విజయవాడ ఇంద్రకీలాద్రికి పాదయాత్రగా బయలుదేరిన భవానీభక్తులకు శనివారం చింతలపాలెంలో అమ్మవారి భక్తులు ఆతిథ్యమిచ్చి సాగనంపారు. శ్రీకాకుళం జిల్లా పాలకొండ నుంచి విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి కాలినడకన బయలు దేరిన వెంకటేష్, రామారావు, గోవింద బృందం, పరవాడపాలెం నుంచి బయలుదేరిన భవానీభక్తుల బృందం పాదయాత్ర వేర్వేరుగా చింతలపాలెం చేరింది. వీరికి అక్కడ గురు భవానీ జెర్రిపోతుల నూకినాయుడు సమకూర్చిన పండ్లు, ఫలహారాలు అందించి ఆతిథ్యమిచ్చారు. అనంతరం వారిని గ్రామ శివారు వరకు వెళ్లి సాగనంపారు. కార్యక్రమంలో స్థానిక భవానీ భక్తు లు మజ్జి నాయుడు, యర్ర జ్యోతికుమార్, సియాద్రి చిట్టిబాబు, నారిపల్లి అర్జున్, పూడి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నాటకం సజీవంగా కొనసాగాలి

- హాస్యనటుడు సత్తిపండు
- రాష్ట్ర స్థాయి నాటకోత్సవాలు ప్రారంభం



మనస్విని నాటిక ప్రదర్శన

తుమ్మపాల : పట్టణంలో గవరపాలెం శ్రీ కనక దుర్గమ్మ అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా స్థానిక శ్రీగౌరీ సేవా సంఘం మళ్ల జగన్నాథం కళ్యాణమండపం లో ఈనెల 3 నుండి 7 వరకు రాష్ట్ర స్థాయి నాటకోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. కర్రి రమేష్ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల నాటకోత్సవాల్లో భాగంగా శనివారం నాటిక ప్రదర్శనలను హాస్యనటుడు పి.ఎస్.వి. సత్యనారాయణ (సత్తిపండు) ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న నాటక ప్రదర్శనలు భవిష్యత్తులో కూడా జరగాలని, నాటకం సజీవంగా ఉండాలని, కొన్ని సంస్థలకు ఈ నాటకోత్సవాలు ఆదర్శం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాటక ఉత్సవాల విరాళ దాత కర్రి సన్యాసినాయుడు, కనక దుర్గమ్మ ఆలయ వ్యవస్థాపకుడు పి.వి. రమణ, నాటకోత్సవాల పర్యవేక్షకుడు కె.ఎం. నాయుడు, శ్రీ కనకదుర్గమ్మ ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు, వర్తక సంఘం కోశాధికారి పెంటకోట శ్రీనివాస్, శ్రీ గౌరీ పరమేశ్వరి ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావునాయుడు, గౌరీ సేవా సంఘం కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, పెంటకోట సూరి అప్పారావు, మల్ల సూరిబాబు, దేవాదుల శివాజీ పాల్గొన్నారు.

ప్రేక్షకులను అలరించిన నాటికలు

మొదటి ప్రదర్శన అరవింద ఆర్ట్స్ తాడేపల్లి, గుంటూరు వారితో ప్రదర్శించబడిన మనస్విని నాటిక, రచన వల్లూరి శివప్రసాద్, దర్శకత్వం గంగోత్రి సాయి, రెండో ప్రదర్శన ఆరాధన ఆర్ట్స్ అకాడమీ గుంటూరు వారి నాటిక క్షేత్రం రచన ఆకురాతి శిల్ప, జీవి మనోహర్ దర్శకత్వం వహించారు. రెండు నాటికలు ప్రేక్షకుల ప్రశంసలు పొందాయి. నటీనటులు తమ పాత్రలకు ప్రాణం పోశారు.

జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు కశింకోట విద్యార్థిని



ఝాన్సీకి అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

కశింకోట: జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు తమ విద్యార్థిని ఎస్.ఝాన్సీ ఎంపికైనట్లు స్థానిక సెయింట్ జాన్స్ స్కూలు ప్రిన్సిపాల్ రూపానంది శనివారం తెలిపారు. ఇటీవల సీబీఎస్ఈ ఆధ్వర్యంలో జరిగిన క్లస్టర్ స్థాయి అండర్- 14 విభాగం అథ్లెటిక్స్ వంద మీటర్ల పరుగులో ఝాన్సీ పాల్గొందన్నారు. ఇందులో రాణించి ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. ఈ మేరకు ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో ఆదివారం నుంచి జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననుందన్నారు. ఈ సందర్భంగా ఝాన్సీని, ఆమె తల్లిదండ్రులను అభినందించారు.

కుట్టు శిక్షణ.. ఉపాధికి రక్షణ

- రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు తర్ఫీదు
- శిక్షణ తర్వాత ఉచితంగా కుట్టుమిషన్ల పంపిణీ
- కోల్ ఇండియా సీఎస్ఆర్ నిధులతో కొనుగోలు



అత్యాధునిక టెక్నాలజీతో కూడిన కుట్టు మిషన్లు



అత్యాధునిక టెక్నాలజీ విద్యుత్‌తో కూడిన మిషన్‌పై శిక్షణ పొందుతున్న మహిళలు

అనకాపల్లి: సేవలకు ప్రతిరూపంగా మారిన రోటరీ క్లబ్ ఈ ఏడాది జూలైలో 71వ సంవత్సరంలోకి అడుగు పెట్టిన సందర్భంగా బలహీన వర్గాల మహిళలకు స్వయం ఉపాధి కల్పనలో భాగంగా ఉచిత కుట్టు శిక్షణకు శ్రీకారం చుట్టింది. శిక్షణ అనంతరం కోల్ ఇండియా ఆర్థిక సాయంతో ఆధునిక పరిజ్ఞానంతో కూడిన కుట్టుమిషన్లు ఉచితంగా పంపిణీ చేయనుంది.

శిక్షణ కాలంలో...

- ఇచ్ఛాపురం నుంచి విజయవాడ వరకూ రోటరీ క్లబ్‌లు వంద ఉండగా, కోల్ ఇండియా కంపెనీ సీఎస్ఆర్ నిధులు రూ.1.80 కోట్లతో కొనుగోలు చేసిన 800 కుట్టుమిషన్లు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అందులో భాగంగా అనకాపల్లి రోటరీ క్లబ్‌కు 15 కుట్టుమిషన్లు అందజేశారు.
- అత్యాధునిక టెక్నాలజీతో కూడిన 15 కుట్టు మిషన్ల విలువ రూ. 3.75 లక్షలు
- ఒక్కొక్క మిషన్ విలువ రూ.25 వేలు
- ముందుగా రోటరీ క్లబ్ సభ్యులు అనకాపల్లిలో 15 మంది నిరుపేద మహిళలను గుర్తించారు. వీరికి అనకాపల్లి పాలులూరి చిదంబరం మెమోరియల్ రోటరీ క్లబ్ హాల్లో గత నెల 27 నుంచి ఈ నెల 10వ తేదీ వరకూ కుట్టు శిక్షణ ఇస్తున్నారు. ఆ సమయంలో వివిధ రకాల మోడల్స్, డిజైనింగ్ వంటి వాటిని నేర్పిస్తున్నారు.
- శిక్షణ కాలంలో ఎటువంటి రుసుం తీసుకోవడం లేదు.
- రోజూ ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కుట్టు శిక్షణ ఇస్తున్నారు.

సేవల్లో తరిస్తున్న రోటరీ...

పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే దృఢ సంకల్పంతో తమ వంతు సహాయంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు 1955 జూన్‌లో అనకాపల్లిలో రోటరీ క్లబ్ ఏర్పడింది. అప్పటి అయ్యర్‌శాస్త్రి ఆధ్వర్యంలో 21 మంది సభ్యులతో ఏర్పడిన క్లబ్ దినదిన ప్రవర్ధమానమవుతూ నేడు 91 మంది సభ్యులకు చేరింది. ఏటా క్లబ్‌లో కొత్త కార్యవర్గం జూలై నుంచి ప్రారంభమవుతోంది. రోటరీ క్లబ్ సభ్యులు కృషితో 2002లో అప్పటి సీనియర్ సభ్యులు పప్పతి వెంకటరావు, ఉప్పల సన్యాసిశెట్టి మరో అడుగు ముందుకేసి అనకాపల్లి మర్చంట్ అసోసియేషన్ సహకారంతో కొత్తగా రోటరీ కంటి ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి నేటి వరకూ నిరుపేద రోగులకు ఉచితంగా కంటి పరీక్షలు చేయడమే కాకుండా అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తున్నారు. మందులు, కళ్లద్దాలు పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుత రోజుల్లో నెలకు 30 మంది వరకూ నేత్ర శస్త్రచికిత్సలు చేస్తున్నారు. ఈ విధంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏటా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, పేదల ఆదరణ పొందుతున్నారు.

రోటరీ క్లబ్, కోల్ ఇండియా సహకారంతో శిక్షణ



అత్యాధునిక టెక్నాలజీతో కూడిన కుట్టుమిషన్లు మొదటి సారిగా జిల్లాలో మహిళలకు పంపిణీ చేయడం మొదటి సారి. బలహీన వర్గాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే దృఢ సంకల్పంతో శిక్షణ ఇస్తూ ఉచితంగా కుట్టు మిషన్ అందజేస్తున్నాం. ఇవి హైస్పీడ్ టెక్నాలజీతో కూడి కమర్షియల్ మిషన్. గతేడాది 200 సాధారణ కుట్టుమిషన్లు, 125 సైకిళ్లు పంపిణీ చేశాం. ఈ ఏడాది మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తున్నాం. రోటరీ క్లబ్ అదనంగా మరో రూ. 50 వేలు ఖర్చు చేసి మహిళలకు శిక్షణ ఇస్తున్నాం.

– రోటరీ క్లబ్ కుట్టు మిషన్ల శిక్షణ చైర్మన్ **కడిమిశెట్టి సతీష్**, కో చైర్మన్ **బుద్ధ రమణాజీ**

రోటరీ క్లబ్ సేవలు మరువలేనివి



నేను పదో తరగతి వరకూ చదువుకున్నాను. 13 ఏళ్ల క్రితం నాకు వివాహమైంది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. నా భర్త ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. రోటరీ క్లబ్ మహిళలకు ఉచితంగా అత్యాధునిక టెక్నాలజీతో కూడిన కుట్టుమిషన్ పంపిణీ చేస్తున్నారని తెలుసుకుని దరఖాస్తు చేశాను. రూపాయి కూడా తీసుకోకుండా కుట్టు మిషన్ శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పూర్తయిన వెంటనే మిషన్ తీసుకుని ఇంటి వద్దనే షాప్ ఏర్పాటు చేసి ఆర్థికంగా ఎదుగుదలకు కృషి చేస్తాను.

– **ద్వారపూడి రూప**, కృష్ణాపురం కాలనీ, అనకాపల్లి మండలం

రూ.25 వేల ఉచిత కుట్టుమిషన్ ఇచ్చారు



రోటరీ క్లబ్ సభ్యులు మా మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇస్తూ, రూ.25 వేల విలువ చేసే కుట్టుమిషన్ ఉచితంగా ఇచ్చారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా నేటి సమాజంలో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. శిక్షణ అనంతరం కుట్టు మిషన్ ద్వారా సంపాదించుకుని నా పిల్లలను బాగా చదవించుకుని, నా భర్తకు తోడుగా ఉంటాను.

– **కోరుకొండ ధనలక్ష్మి**, తుమ్మపాల, అనకాపల్లి మండలం

శిక్షణ బాగుంది



శిక్షణ అనంతరం కుట్టు మిషన్ ఉచితంగా అందజేయడం ఎంతో ఆనందంగా ఉంది. ఇవి వివిధ రకాల మోడల్స్ కుట్టుకునేందుకు ఎంతగానో ఉపయోగపడుతుంది. రోటరీ క్లబ్ సేవలు మరువలేనివి. శిక్షణలో కుట్టుకునేందుకు క్లాత్, పరికరాలు ఉచితంగా ఇచ్చారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా మాలాంటి నిరుపేద మహిళలకు ఉచితంగా శిక్షణ ఇవ్వడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుంది.

– **బసవ లోవకుమారి**, పిల్లవారివీధి, అనకాపల్లి

15 మందికి శిక్షణ ఇస్తున్నా



వివిధ వర్గాల చెందిన 200 మంది మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ ఇచ్చాను. చాలామంది ఇంటి వద్దనే వివిధ రకాల మోడల్స్ కుట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోటరీ క్లబ్ వారి ఆదేశాల మేరకు అత్యాధునిక మోడల్ కుట్టుమిషన్‌పై నేర్పిస్తున్నాం. 14 రోజుల తర్వాత అదే మిషన్ మహిళకు ఉచితంగా ఇవ్వనున్నారు. మహిళలందరూ శ్రద్ధగా నేర్చుకుంటున్నారు.

– **బొబ్బిలి దుర్గాదేవి**, శిక్షకురాలు, అనకాపల్లి

ధ్యాన వేంకటేశ్వరునికి ప్రత్యేక అలంకరణ



కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని శనివారం వజ్ర కవచంతో పాటు పలు రకాల పూల దండలు, తులసీ మాలలతో అందంగా అలంకరించారు. ప్రత్యేక అర్చనలు చేశారు. అర్చకుడు రేజేటి రామ చరణాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి భక్తులు ఎక్కువగా హాజరయ్యారు.

దీప ఘటాల ఊరేగింపు



కన్నూరుపాలెంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాలు

కశింకోట: కన్నూరుపాలెంలో శనివారం రాత్రి భవానీ భక్తులు దీప ఘటాల ఊరేగింపు నిర్వహించారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి అమ్మవారి రెండు విగ్రహాలను సామాజిక భవనంలో నెలకొల్పారు. మూల విగ్రహం, మరొకటి ఊరేగింపులో భక్తులు మోసే చిన్న విగ్రహం ఏర్పాటు చేశారు. వీటి ముందు అందంగా ముగ్గులు వేసి ఏర్పాటు చేసిన అగ్ని గుండాన్ని భక్తులు సంప్రదాయంగా తొక్కారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

పేకాట శిబిరంపై దాడి



పట్టుకున్న నగదు లెక్కిస్తున్న ఎస్ఐ భీమరాజు

నాతవరం : మండలంలో మన్యపురట్ల గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న వారిపై శనివారం నాతవరం ఎస్ఐ సిహెచ్.భీమరాజు సిబ్బందితో దాడి జరిపారు. నలుగురు వ్యక్తులను పట్టుకుని వారి వద్ద నుంచి రూ.1540 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎక్కడ పేకాట, పందాలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

కశింకోటలో ఈదురుగాలుల బీభత్సం

- విరిగిపడిన చెట్లు, కొమ్మలు
- విద్యుత్తు సరఫరాకు అంతరాయం



గాలులకు గవరపేటలో రెండు ఇళ్లపై విరిగి పడిన వేప చెట్టు



బయ్యవరం పెద్ద చెరువు వద్ద జాతీయ రహదారిపై విరిగి పడిన చెట్లు, కొమ్మలు



కశింకోట ఆర్టీసీ బస్సు స్టేషన్ ఆవరణలో బురదమయం



కశింకోట మండల పరిషత్ కార్యాలయం ముందు చేరిన వర్షపు నీరు



చెట్లు, కొమ్మలు విరగడంతో జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు

కశింకోట: మండల కేంద్రంలో శనివారం మధ్యాహ్నం ఈదురుగాలుల బీభత్సం సృష్టించాయి. దీంతో పలుచోట్ల చెట్లు, కొమ్మలు విరిగి పడ్డాయి. జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు కొంతసేపు అంతరాయం కలిగింది. ఆకాశంలో ఒక్కసారిగా మేఘాలు కమ్ముకుని గాలులు వీచి పెద్ద ఉరుములు, మెరుపులతో అరగంటకు పైగా వర్షం కురిసింది. దీంతో స్థానిక గవరపేటలో విశ్వ బ్రాహ్మణుల వీధిలో వేప చెట్టు మొదలకు విరిగి సన్యాసిరావు ఇంటిపై పడింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణహాని జరగలేదు. పై కప్పు దెబ్బతింది. దాని పక్కనున్న పై అంతస్తుపైనా చెట్టు కొమ్మ పడి దెబ్బతింది. దిగువ అంతస్తులో తప్ప పై అంతస్తులో ఎవరూ లేరు. ప్రమాదం తప్పింది. ఇల్లు కాస్త దెబ్బతింది. వర్షం వల్ల పల్లపు ప్రాంతాల్లో నీరు చేరింది. స్థానిక గవరపేట మేదర వీధిలోను, స్టేట్ బ్యాంకు వీధి రోడ్లలో నీరు నిలిచి ప్రజలు, వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. ఆర్టీసీ బస్ స్టేషన్ ప్రాంతం బురదమయంగా మారడంతో ప్రయాణికులు బస్సు ఎక్కి దిగడానికి ఇబ్బందికి గురయ్యారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట పల్లపు ప్రాంతంలో నీరు చేరింది. బయ్యవరం వద్ద పెద్ద చెరువు గట్లపై చెట్లు, కొమ్మలు గాలులకు విరిగి జాతీయ రహదారిపై అడ్డంగా పడ్డాయి. దీంతో అనకాపల్లి–యలమంచిలి మార్గంలో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. ఆ తర్వాత వాటిని రహదారి నిర్వహణ సిబ్బంది తొలగించడంతో రాకపోకల క్రమబద్ధీకరణ అయ్యాయి. గాలుల వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. సిబ్బంది సరఫరాను పునరుద్ధరించారు. తాళ్లపాలెం కూడలిలో అనకాపల్లి–నర్సీపట్నం మార్గంలో వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో వాహన చోదకులు, ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు.

అమ్మవార్లకు విశేష అలంకరణ

- కొనసాగుతున్న శరన్నవరాత్రోత్సవాలు
- దర్శించుకుంటున్న భక్తులు



నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న ఆర్డీవో షేక్ ఆయేషా



కశింకోట కనకదుర్గ ఆలయంలో అన్నపూర్ణాదేవి అలంకరణ



ధనలక్ష్మి దేవి రూపంలో కనకదుర్గమ్మ



ధనలక్ష్మి రూపంలో వాసవీ కన్యకాపరమేశ్వరి

తుమ్మపాల: దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు మూడో రోజు శనివారం ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబిక అమ్మవారికి సూర్య నమస్కారాలు, కుంకుమ పూజలు భక్తులు నిర్వహించారు. అమ్మవారిని నూతన ఆర్డీవో షేక్ ఆయేషా దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించి జ్ఞాపిక అందించి సత్కరించారు. ఉచిత భోజనం విరాళాల దాతలు, అమ్మవారి భక్తులు విరాళంతో గంట రఘు కృష్ణలక్ష్మి దంపతులు సహకారంతో భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎస్.సుజాత, డిప్యూటీ తహసీల్దార్ వై.శ్రీరామూర్తి పాల్గొన్నారు.

ధనలక్ష్మి అలంకరణలో..

ప్రసిద్ధి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో వాసవీ కన్యకాపరమేశ్వరి ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి మహోత్సవంలో భాగంగా శనివారం ఉదయం బేడసేవ శ్రీచక్ర అభిషేకాలు, నక్షత్ర హారతి గోపూజ ఘనంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ప్రతిష్ట శత జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ వుప్పల శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

- కామాక్షి దేవి ఆలయంలో మూడో రోజు అమ్మవారిని ధనలక్ష్మి రూపంలో అలంకరించి పూజలు చేశారు. భక్తుల కుంకుమ పూజలు, అభిషేకాలతో మండలం సందడిగా మారింది. ఉత్సవ కమిటీ చైర్మన్ కోటిపల్లి శ్రీను, ఉపాధ్యక్షుడు శొంఠ్యాణ సతీష్, కోశాధికారి ధవలేశ్వరం లక్ష్మణరావు, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కోటిపల్లి జేజిబాబు, ప్రధాన కార్యదర్శి కొమ్మోజు గోవిందరాజు, కోశాధికారి పొన్నాడ నరసింహచారి, ఉత్సవ కన్వీనర్ అములోజు శ్రీను, జి. అప్పారావు, పట్టణ విశ్వ బ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

గజలక్ష్మిగా..

గవరపాలెం గౌరీ పంచాయతన దేవాలయంలో అమ్మవారు గజలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అంపోలు గోపాలకృష్ణ శర్మ, అంపోలు రాంప్రసాద్ శర్మ, కోట శ్రీకర్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని అలంకరించారు. మండపంలో మహిళలు సామూహిక సహస్ర నామ పూజ చేశారు. ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గాయత్రీదేవిగా...

గవరపాలెం శతకంపట్టు కనకదుర్గ ఆలయంలో అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరణ చేశారు. ఉదయగిరి చంద్రశేఖర్, ఆలయ ప్రధాన అర్చకుడు భోగారపు వెంకటరమణ (బాబు)ల ఆధ్వర్యంలో అమ్మవారికి నిత్యపూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ శాశ్వత చైర్మన్, ఆలయ నిర్వాహకుడు కాండ్రేగుల నాయుడు, ఆలయ వ్యవస్థాపకుడు పి.వి. రమణ, ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరాహ నూకరాజు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చనలు

కశింకోట: స్థానిక హైవే పక్కన వెలసిన కనకదుర్గ ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు ప్రత్యేక కుంకుమార్చనలు చేశారు. భవానీ భక్తులు ఎక్కువ సంఖ్య లో సందర్శించారు. ఆలయ వ్యవస్థాపకుడు ఎస్. ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. స్థానిక పురాతన శివాలయంలో సర్వమంగళాంబను అన్నపూర్ణా దేవిగా అలంకరించారు. ఆలయ అర్చకులు వి. చిదంబరం, కృష్ణల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు కుంకుమార్చనలు చేశారు.

సాఫ్ట్‌బాల్ జాతీయస్థాయి పోటీలకు ఎంపిక




లక్ష్యను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

పరవాడ: ఏపీ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ముప్వ లక్ష్య ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎస్. సీతాలక్ష్మి తెలిపారు. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి, జాతీయస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. కర్నూల్ జిల్లా నంద్యాలలో ఈ పోటీలు జరగనున్నట్లు తెలియజేశారు. లక్ష్యను పాఠశాల సీఈవో కె.నిశాంత్ అభినందించారు.

నేత్రపర్వంగా నృసింహ హోమం



కుంభప్రోక్షణలో భాగంగా ప్రధాన కలశాన్ని శిరస్సుపై పెట్టుకుని ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు



నృసింహ హోమం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మతార స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని శనివారం సింహగిరిపై శ్రీ నృసింహ హోమం నేత్రపర్వంగా జరిగింది. ఉదయం 7గంటల నుంచి ఆలయ కల్యాణమండపంలో అర్చకులు హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదికపై చక్రపెరుమాళ్లను కొలువుదీర్చి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, షోడశోపచార పూజలు చేశారు. పూజలో పాల్గొన్న భక్తులు కంకణధారణ చేసి, హోమగుండం వద్ద ఆశీనులయ్యారు. మండపారాధన, అగ్నిప్రతిష్ట, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. కుంభప్రోక్షణను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఉచిత ఇసుక అమలులో ప్రభుత్వం విఫలం



ఫార్మాసిటీలో ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు అయినా ఉచిత ఇసుక హామీని అమలు చేయడంలో విఫలమైందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. భవన నిర్మాణాలు చేస్తున్న ప్రజలకు గాని, ఈ రంగంపై ఆధారపడిన కార్మికులకు గాని ప్రయోజనం లేకుండా పోయిందని విమర్శించారు. ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని కోరుతూ ఫార్మాసిటీలో సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ ఉచిత ఇసుక హామీని అమలు చేయని కారణంగా భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. అందరికీ ఇసుకను అందుబాటులోకి తెచ్చి, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి చూపడానికి కూటమి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ధర్నాలో భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు పి.వీరునాయుడు, దుర్గారావు, మణి, రమణమ్మ, కార్మికులు పాల్గొన్నారు.